క్లుప్తంగా

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

డోన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం కలిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ వెంకటరమణ సూచించారు. మండలంలోని దొరపల్లెలో గురువారం జిల్లా మెడికల్ అధికారి రాంభూపాల్‌తో కలిసి పర్యటించారు. హైస్కూల్, అంగన్‌వాడీ సెంటర్లలో మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అవుట్ పేషెంట్ల సంఖ్య తదితర వివరాలు, సౌకర్యాలపై సిబ్బందితో మాట్లాడి ఆరా తీశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ వై విద్య, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి సుజాత, ఏఎస్ఎం లత మంగేష్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, పద్మావతమ్మ దంపతులు రూ.50వేలను ఈఓ రామానుజన్‌కు గురువారం అందజేశారు. ఈమేరకు దాతలను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

డోన్ : రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో యాచక వృత్తి చేసుకుంటూ తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తి(60) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. రైల్వే పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ద్రోణాచలం సేవా సమితి ఆత్మబంధువు సభ్యులు మృతదేహానికి హిందూ సంప్రదాయం ప్రకారం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్యాల శ్రీనివాసరెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు రాజయ్యగౌడ్, చంద్రశేఖర్ ఆర్థిక సాయం చేశారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు షాధిఖాన రాజు, గురుస్వామి, కరుణాకర్, పానీపూరి మురళి, సయ్యద్ వలి, రసూల్, డోన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే ప్రధాన నీటి వనరైన గాజులదిన్నె ప్రాజెక్టు పైపైలైన్ లీకేజీ కారణంగా శుక్ర, శనివారాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామం వద్ద పైప్‌లైన్ పగిలినందున మరమ్మతులు చేపట్టామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అవుకు: ప్రసుత్తం సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్ వైజర్ కమాల్ సాహెబ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గుండ్లశింగవరంలో ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లావణ్య, ఆరోగ్య కార్యకర్త చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ

డోన్ టౌన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం, గుమ్మకొండ గ్రామాల్లో గురువారం తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసలు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, వెంకటాపురం సర్పంచ్ బోయ రాణి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గద్దం సుధాకర్‌రెడ్డి, చిన్న హనుమన్న, నాగరాజు, గట్టన్న, సురేంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

బనగానపల్లెరూరల్: పాఠకులకు గ్రంథాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ సూచించారు. గురువారం బనగానపల్లె గ్రంథాయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయ అధికారి బషీర్‌అహ్మద్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వి నియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

త్రిపుల్ ఐటీకి ఎంపిక

ప్యాపిలి: పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. స్థానిక సినిమా వీధిలో నివాసం ఉంటున్న పాండు, రమాదేవిల కుమార్తె భావన, హుసేనాపురం వీధిలో ఉంటున్న వంశీ, సుహాసినిల కుమారుడు మనోజ్ కుమార్ ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, సాంకేతిక సమస్యల కారణంగా పొందని పేదలను గుర్తించి న్యాయం చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని పేదలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని ఎర్రగుడి, టంగుటూరు గ్రామాలతో పాటు బనగానపల్లె సచివాలయం -2లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. పట్టణంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే 11 రకాల ప్రభుత్వ సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు లభించాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ పేదలు తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడేవారని, వారికి లంచం ఇవ్వందే మంజూరు చేసేవారు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు నేరుగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ విమర్శలు సిగ్గుచేటు...

దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు సిగ్గు చేటని ఎమ్మెల్యే కాటసాని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం వలంటీర్ల సేవలను కొనియాడుతున్న విషయం ఈయనకు తెలియదా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు దత్తపుత్రుడికి తెలియకపోయినా రాష్ట్ర ప్రజలకు బాగా తెలసుని, వారి సాయానికి వెలకట్టలేమని గుర్తు చేశారు. బనగానపల్లెలో జరుగుతున్న అభివృద్ధిని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఓర్వలేక పోతున్నారని, దాదాపు మూడువేల మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేసేందుకు తాను సిద్ధం చేస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని, మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. స్థానిక అతిథి గృహం నుంచి జీఎంటాకీస్ వరకు రూ.8 కోట్లలో రోడ్డు విస్తీరణ అభివృద్ధి పనులు జరుగుతుంటే రోడ్డు అక్రమణదారులను కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని రెచ్చగొట్టారని ఆరోపించారు.



మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎర్రబోతుల పాపిరెడ్డి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు,



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న స్పెషల్ అధికారి

గ్రామ స్వరాజ్యం జగనన్న లక్ష్యం

కొలిమిగుండ్ల: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. గురువారం చింతలాయిపల్లె గ్రామ సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయ హాజరయ్యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, ఎంపీపీ కారపాకుల నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డితో కలిసి 791 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. ఈసందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో రైతులు విత్తనాల కోసం పడరాని పాట్లు పడేవారని,చివరకు విత్తనాల కోసం రైతులు ధర్నాలు చేస్తే వారిపై కేసులు పెట్టిన రోజులను గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారపాకుల లక్ష్మీనారాయణ, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, విజయ రాఘవేంద్రారెడ్డి, ఓబులేసు, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, జిల్లా పబ్లిసిటి వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ మొలక రాజారెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం తహసీల్దార్ పుష్ప కుమారి, ఎంపీడీఓ రాధిక జగనన్న సురక్ష సదస్సు ఏర్పాటు చేశారు. జోళదరాశి, కలుగొట్ల గ్రామాల్లో అన్ని అర్హతలు ఉండి వివిధ సంక్షేమ పథకాలు వర్తించని లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం పలువురికి కుల, ఆదాయ, పుట్టినతేదీ సర్టిఫికెట్లు, వన్‌బీ అడంగళ్లు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు రామశంకర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, ఎస్‌ఐ కల్పన, ఉపాధి పథక ఏపీఓ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంజామల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని బనగానపల్లె స్పెషల్ అధికారి వెంకటశివ అన్నారు. లింగందిన్నె గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నాగకుమార్, తహసీల్దార్ మల్లికార్జున రావు, లింగందిన్నె సర్పంచ్ అన్నెం దేవి, అక్కంపల్లి సర్పంచ్ గుర్కు వెంకట క్రిష్ణా రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెం శివరామిరెడ్డితో కలిసి ఆయన ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కప్పెట వెంకటశ్వర్ రెడ్డి, బొమ్మిరెడ్డి క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లెలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 93 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈఓఆర్‌డీ రామక్రిష్ణవేణి, ఏపీఎం విజయగోపాల్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివమ్మ, సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ చిన్న కంబగిరి స్వామి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

బనగానపల్లెరూరల్: అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, మండలాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. స్థానిక పొదుపు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన జరిగిన మండల మీట్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మండలంలో జరుగుతున్న అభివృద్ధిని వివిధ శాఖల అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె – ప్యాపిలి రోడ్డు అభివృద్ధికి రూ.18 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ రామయ్య, మండల ఉపాధ్యక్షురాలు ఎం



బనగానపల్లె మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సుబ్బలక్ష్మీ, కుర్ణి కార్పొరేషన్ డైరెక్టర్ శ్యాలమదేవి, హౌసింగ్ డీఈఈ కృష్ణారెడ్డి, ఏపీఓ హరికృష్ణ, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌కుమార్‌రెడ్డి, ఏఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

బేతంచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా అన్నారు. గురువారం పట్టణంలోని 3, 4 వ సచివాలయాల్లో జగనన్న సురక్షను తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, డీటీ సత్యదీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రా లు అందజేశారు. కార్యక్రమంలో వెఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, సలీమ్, ఖాజా, తిరుమలేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ కోట్ల మధు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం ఒకటి, రెండో సచివాలయాల్లో గురువారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలకృష్ణుడు ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీటీ మారుతి, ఏపీఓ నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : పట్టణ పరిధిలోని 10వ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఓ మధుసూధనరావు, ఆర్ఐ జాకీర్‌తో కలిసి కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర,సుంకయ్య 438 మందికి వివధ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్ఐ సునీల్‌రాజు, వార్డు ఇన్‌చార్జ్ మహేంద్రనాయుడు, సచివాలయ కన్వీనర్ షాషావలి, సీపీఐ నాయకుడు బాషా పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

డోన్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పథకాల ఫలాలు పొందేందుకు అర్హత పొందాలని సురక్ష ప్రోగ్రాం మున్సిపల్ ప్రత్యేక అధికారి రంగన్న అన్నారు. స్థానిక 27వ వార్డులో కౌన్సిలర్ వెంకట్రాముడు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం అడ్మిన్ షేక్షావలి, వెల్ఫేర్ అధికారి ఆలా రమేష్‌లు పలువురికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుపెంట వెంకటేష్, గుండ్లకొండ మల్లికార్జున, డీలర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బేతంచెర్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్ అన్నారు. గురువారం పట్టణంలో సంజీవనగర్ కాలనీల్లో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు,సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి,మధు, కోట్ల మధు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూనినాగరాజు, శేఖరయ్య, భాస్కర్, నజీర్, రమేష్, తిరుమలేశ్వర్ రెడ్డి, అజాం బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



కోటవీధిలో నిర్మించిన అంతర్గత రహదారి,



కళకళలాడుతున్న దుర్గమ్మగుడి వీధి రహదారి

కలుగొట్లకు కొత్త శోభ..!

- రూ. 1.05 కోట్లతో అంతర్గత సీసీరోడ్లు
- రేపు రోడ్లను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామానికి కొత్త శోభ సంతరించుకుంది. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న అంతర్గత రోడ్ల కష్టాలు తీరిపోయాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 1.05 కోట్లతో ఆయా కాలనీల్లో సీసీరోడ్లు ఏర్పాటు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వడ్డెపేట, మాలపేట, దుర్గమ్మగుడి, కోట వీధి, తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అవస్థలు వర్ణనాతీతం. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ఆయా కాలనీల్లో 1.2 కిమీ మేర సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. దీంతో కాలనీలు కొత్తరోడ్లతో కళకళలాడుతున్నాయి. శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సీసీరోడ్లను ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

కోవెలకుంట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ కల్పన హెచ్చరించారు. గురువారం మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఉన్న పొలాల్లో మద్యం తాగుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిస్తే ఉపేక్షించమని, జైలుకి పంపుతామని హెచ్చరించారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

బనగానపల్లె: నేటి యువతి,యువకులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధిలో రాణించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి రోడ్డులో ఎవరెస్ట్ మార్ట్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, ఎవరెస్టుబాబు, నవాబ్‌జాన్, చాంద్‌బాషా, హైదర్ అబ్బాస్ జమీల్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్‌ఐటీకి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

బనగానపల్లెరూరల్: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మీ గురువారం తెలిపారు. పదవ తరగతిలో 566 మార్కులు సాధించిన లక్ష్మీనిహారిక, 542 మార్కులు సాధించిన మీరాబాయి ట్రిబుల్‌ఐటీకి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు అభినందించారు.

పెండింగ్ చలానాలపై తనిఖీలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారితోపాటు పట్టణంలోని పలు చోట్ల గురువారం పోలీసులు పెండింగ్ చలానాలపై తనిఖీలు నిర్వహించారు. గతంలో రోడ్డు నిబంధనలు పాటించని వాహనాలకు జరిమాన విధించారు. కొన్ని నెలలు గడుస్తున్నా జరిమానా చెల్లించని వాహనాలను ఆపి వివరాలను పరిశీలించారు.

మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

కొలిమిగుండ్ల: కుటుంబాల ఆర్థికాభివృద్ధికి మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. మండల పరిధ / లోని చింతలాయిపల్లెలో సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కల్పిస్తున్న ఉపాధి పనులను గురువారం జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఫినాయిల్, డిటర్జంట్ తయారీ తదితర వివరాలను అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణ చేపట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కత్తి సుబ్బయ్య కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ చేపట్టకపోవడంతో మాదిగలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతోందన్నారు. వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించ తలపెట్టామన్నారు. మాదిగలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అభినందనీయులు వలంటీర్లు...



బైటిపేటలో కరోనా సమయంలో సరుకులు అందజేస్తున్న వలంటీర్ చిట్టిబాయి (ఫైల్)

ఈ చిత్రంలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువతి చిట్టి బాయి బేతంచెర్ల పట్టణంలో బైటిపేట వలంటీర్. డిగ్రీ వరకు చదువుకున్నా సేవా భావంతో వలంటీర్‌గా సేవలందిస్తూ ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకుంది. ప్రత్యేకించి కరోనా సమయంలో ఆమె అందించిన సేవలను ఆయా కాలనీల వాసులు ఇప్పటికీ గుర్తు చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని మరీ సేవందించింది. సహాయకులు లేని వృద్ధులు, ఒంటరి మహిళలకు తానే సర్వం సమకూర్చేది. సరుకుతోపాటు సలహాలు, సూచనుల చేసిన తీరును నేటికీ గుర్తు చేసుకుంటున్న బైటిపేట ప్రజలు వలంటీర్లు అభినందనీయులు అంటున్నారు.

సేవల్లో ఆప్యాయత....



ఎవరేమనుకున్నా... కరోనా సమయంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి. నాకు ఒక్కగానొక్క కుమారుడున్నా... ఒంటిరిగా జీవనం సాగిస్తున్నా. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నాకు కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అయోమయంలో ఉన్న తనకు వలంటీర్ చిట్టిబాయి తోడుగా నిలిచింది. కూరగాయలతోపాటు అవసరమైన మందులు అందజేసేది. వలంటీర్ సేవలు జీవితాంతం గుర్తుంటాయి. ఆ సమయంలో వలంటీర్లే లేకుంటే ఎంతోమంది మృత్యువాత పడేవారనేది వాస్తవం. వారి సేవలను తప్పుపట్టడం ఏ మాత్రం భావ్యం కాదు.

– సహీరా భాను

కరోనా బాధితులకు అండగా...



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రహంతుల్లా (ఫైల్)

ఈ ఫోటోలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పేరు రహంతుల్లా. కరోనా కష్టకాలంలో ఇతను చేసిన సేవలను మండల కేంద్రం ప్యాపిలి–2 సచివాలయం పరిధిలో ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. తనకు కేటాయించిన కుటుంబాలకు అన్నివిధాలా అండగా నిలిచాడు. ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో వారి వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు, పింఛన్ సొమ్ము అందజేస్తూ సాయపడ్డాడు. ప్రత్యేకించి కరోనా బాధితులతో మాట్లాడుతూ ఏమి కాదని మనోధైర్యాన్ని నింపారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి వెళ్లి తనవంతు సూచనలు చేసి కుటుంబ సభ్యుడిగా మెలిగిన రహంతుల్లా ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ గుర్తు చేస్తున్నారు.

మనువడిలా సేవలందించాడు....



వలంటీర్ల సేవలు చాలా బాగున్నాయి. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్ల గొప్ప సేవలు చేశారు. నా విషయానికొస్తే ఓ మనువడిలా రహంతుల్లా అండగా నిలిచాడు. కరోనా సోకడంతో ఏమౌతుందోనని భయపడుతున్న తనకు ధైర్యానిచ్చాడు. పాటించాల్సిన పద్ధతులను వివరిస్తూ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలని సూచించి పిల్లలకు రక్షణ కల్పించాడు. పింఛన్‌తో పాటు మాస్క్, నిత్యావసర సరుకులు అందజేశారు. వలంటీర్ల సేవలను తప్పుపడితే పాపం వస్తుంది.

– లక్ష్మమ్మ, ప్యాపిలి

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి



డోన్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

డోన్ : జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వివాదాస్పద వాఖ్యలను ఖండిస్తూ వలంటీర్లు చేపట్టిన నిరసనలు డోన్‌లో గురువారం కొనసాగాయి. పట్టణంలో పవన్‌కు వ్యతిరేంగా ప్లకార్డులు పట్టుకుని వలంటీర్లు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియం, కూరగాయల మార్కెట్ మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. పవన్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ప్యాకేజీ స్టార్, పిచ్చి తుగ్లక్ పవన్ కళ్యాణ్ డౌన్, డౌన్ అంటూ నినాదాలు చేశారు. బేషరతుగా వలెంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధ్రుతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

ప్రతిఒక్కరూ ఖండించాలి: పవన్ కళ్యాణ్ వలెంటీర్ల పట్ల చేసిన వ్యాఖ్యలు ప్రజా సామ్యవాదులు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపి నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్ , కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, హరినాథ రెడ్డి , కో–ఆప్షన్ సభ్యుడు పాతపేట రఫీ ఒక ప్రకటణలో కోరారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామ రక్ష అని, 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం కావడం ఖాయమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. యర్రగుడిలో గడప గడపక మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు యాపర్ల వెంకటేశ్వరరెడ్డి, సత్తిగారి రామిరెడ్డి, కంబగిరిస్వామి, వెంకటరెడ్డి, రంగయ్య, శ్రీనివాసరెడ్డి, హరియాదవ్, క్రిష్ణయ్య,వెంకట శివుడు,హుశేన్‌పీరా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య

బనగానపల్లె: మండలంలోని ఎర్రగుడికి చెందిన కౌలు రైతు నట్టల గొల్ల మురళీ కృష్ణుడు(38) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామిరెడ్డి, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు మురళీ కృష్ణుడు 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగు ఖర్చులు, కుటుంబ అవసరాల నిమిత్తం దాదాపు రూ.15లక్షల అప్పు అయ్యింది. వ్యవసాయం కలిసి రాకపోవడంతో అప్పు తీర్చలేనని మనస్థాపానికి గురైన కౌలురైతు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య గురులక్ష్మీ, కొడుకు,కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు.

కంట్రాక్ట్ ఉద్యోగి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో కంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సోమన్న(34) గురువారం ఉదయం వాకింగ్‌కు చేస్తుండగా గుండె పోటు రావడంతో శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తీసుకెళ్లగా కోలుకోలేక మరణించాడు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

డోన్ టౌన్ : మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్‌పీ గ్యాస్‌కు చెందిన ఆరుగురు సిబ్బందికి గాయాలయ్యాయని రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. ప్యాపిలి మండలం మెట్టుపల్లె నుంచి డోన్ పట్టణానికి వస్తున్న గ్యాస్ ఆటోను కర్నూలు వైపు వెళ్తున్న లారీ వెనుక నుండి ఢీకొట్టడంతో వెంకటవంశీ, కిరణ్, మాబు, మనికంఠ, పెద్దరాజు, సుధాకర్ కు గాయాలు అయ్యాయి. డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్సల అనంతరం వెంకటవంశీ, కిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

బనగానపల్లె: మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో గురువారం కంబగిరి రాముడు పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. నూతన గృహం నిర్మించిన రాముడు లోపలి భాగం శుభ్రం చేస్తుండగా పట్టాల మధ్య ఉన్న పాము కాటేసింది. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకులపల్లె, రామవరం గ్రామ పరిసరాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై గురువారం నంద్యాల ఎస్ఈబీ ఇంటిలిజెన్స్ అధికారి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఏడు బట్టీలను ధ్వంసం చేసి 4,900 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. దాడుల్లో బనగానపల్లె, కోవెలకుంట్ల, సెబ్ ఎస్ఐలు దౌలత్‌ఖాన్, రమేష్, సిబ్బంది పాములేటి, శివన్న, రాజేంద్ర, నాయుడు పాల్గొన్నారు.